క్లుప్తంగా

నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ఏలూరు జెడ్పీ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్‌లలో మంజూరైన, ఇంకా ప్రారంభం కాని నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా లోని జిల్లా పరిషత్ నుంచి మంజూరైన పనుల పురోగతిపై అన్ని డివిజన్ల పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజినీర్లతో చర్చించారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేవీఎస్ఆర్ రవికుమార్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ విభాగపు మూడు జిల్లాల కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొఠారు నియామకంపై హర్షం

దెందులూరు: రాష్ట్ర అసెంబ్లీ సభా హక్కుల కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నియమితులవడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నియామకంపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ పీ. విజయ్‌బాబు, దెందులూరు, ఏలూరు జెడ్పీటీసీలు, నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండలి సరస్వతి కొండలరావు, ఎంపీపీలు బొమ్మనబోయిన సుమలత, తాతా రమ్యకుమార్, బత్తుల రత్న కుమారి, పెన్మెత్స శ్రీనివాసరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు పళ్ళెం ప్రసాద్, ప్రభాకరరావు, ఎం సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, కాపు సంఘం దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడు పోకల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అధిరోహించి నియోజకవర్గంతో పాటు రాష్ట్రస్థాయిలో సేవలందించాలని ఆకాంక్షించారు.

విద్యాభివృద్ధికి అధిక నిధుల కేటాయింపు

దెందులూరు: దెందులూరులోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో-1 ఎవీఎస్‌వీ ప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలను తనిఖీ చేశారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను వేర్వేరుగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక నిధులు వెచ్చిస్తున్నారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలతో భయాందోళన

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నీలాద్రిపురం ఇందిరాకాలనీలో దిర్సిపాం బాబూరావు ఇంటిని ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ కొంతకాలం బాగానే పనిచేసింది. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తరచు మంటలు వస్తున్నాయి. దాంతో ఆ కుటుంబ సభ్యులతోపాటు ఆవీధి ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈవిషయాన్ని విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకువెళ్లామని వారన్నారు. ట్రాన్స్‌ఫార్మరు వేరొక చోటికి మార్చాలని సమీపంలోని ఇంటిలోని వారు కోరుతున్నారు. ఆ ఇంటిలో భార్యభర్తలతోపాటు చదువుకునే ఇద్దరు చిన్నారులున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వచ్చినపుడు పిల్లలు భయపడుతున్నారని ఇంటి యజమాని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లకు వందనం

సీఎం జగన్ ఆలోచన మంచిది



ఏలూరు రూరల్: వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు ఆలోచన ఎంతో మంచిది. నేడు వలంటీర్ లాంటి గొప్ప వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదు. పాలనలో ఎక్కడా అవినీతి జరగకూడదనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీ గల యువతి, యువకులతో వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. మా గ్రామంలో అర్హత గల ప్రతి ఒక్కరికీ పథకం అందించారు. గతంలో మాదిరిగా పథకాల కోసం అందరి చుట్టూ తిరగాల్సిన పని లేదు. వలంటీర్‌నే ఇంటికి పంపించి అర్హులను గుర్తించారు. ఇలాంటి వ్యవస్థల వల్లే అవినీతిని అంతం చేయవచ్చు. ప్రజలకు వలంటీర్లపై గౌరవం పెరిగింది.

– బలే నాగరాజు, లబ్ధిదారుడు, పెదయాగనమిల్లి

వలంటీర్ వల్లే స్థలం వచ్చింది



వలంటీర్ వల్లనే మాకు ఇంటి స్థలం వచ్చింది. మా గ్రామంలో వలంటీర్లు నెల నెలా 1వ తేదీన ఇంటింటికీ వచ్చి వృద్ధులు, వికలాంగులను నిద్ర లేపి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. గతంలో ఇలా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవు. పింఛన్ కోసం ముసలోళ్లు పంచాయతీ కార్యాలయం వద్ద పొద్దున్న వెళ్లితే సాయంత్రం వరకు పడిగాపులు పడేవాళ్లు. ఇప్పుడు ఇంటి వద్దే వేలిముద్ర వేయించుకుని పింఛన్ సొమ్ము ఇచ్చేస్తున్నారు. వలంటీర్ మా కుటుంబ సభ్యుడుగానే భావిస్తాను. ప్రభుత్వం ఏ పథకం పెట్టినా వచ్చి మా కుటుంబానికి చెబుతాడు.

– జి.వెంకటేశ్వరమ్మ, లబ్ధిదారురాలు, పెదయాగనమిల్లి

దళారీ వ్యవస్థ కనుమరుగు



వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో దళారీ వ్యవస్థ కనుమరుగైంది. గత ప్రభుత్వ హయాంలో మాదిరి ఇప్పుడు పేదలు సంక్షేమ పథకాల కోసం దళారీల చుట్టూ తిరగాల్సిన పని లేదు. అందుకే కొందరు నాయకులు వలంటీర్లపై ఆరోపణలు చేస్తున్నారు. కరోనా రోజుల్లో పైసా తీసుకోకుండా వలంటీర్లు ప్రజలకు సేవలు అందించారు. మా వలంటీర్ కరోనాలో ఇంటింటికీ తిరిగి జ్వరం ఉందా, లేదా అని ఆరా తీసేవాడు. వైద్య పరీక్షలు చేయించాడు. మందులు ఇప్పించాడు. ఇప్పుడు పథకాలన్నీ ఇస్తున్నాడు.

– సైదు బాలకృష్ణ, లబ్ధిదారుడు, పెదయాగనమిల్లి

అర్హులందరికీ పథకాలు



మా గ్రామంలో అర్హులు అందరికీ పథకాలు వచ్చాయి. ప్రతి కుటుంబంలో ఒకరు లేదా ఇద్దరికి అమ్మఒడి, జగనన్న దీవెన, జగనన్న ఇంటి స్థలం ప్రభుత్వం అందించింది. వలంటర్ వచ్చి మాకు పథకాల గూరించి చెప్పాడు. మాతో దరఖాస్తు రాయించాడు. అప్పుడు ప్రభుత్వం పథకం మంజూరు చేసింది. వలంటీర్ లేకపోతే ఎవరిని అడగాలి. ఎవరి వద్దకు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడేవాళ్లం. ప్రభుత్వం వలంటీర్లను పెట్టి మంచి పని చేసింది. ముఖ్యంగా మా లాంటి పేదలకు మేలు జరిగింది. వలంటీర్ లేకపోతే నాలాంటి వృద్ధులు, పేదోళ్ల కష్టాలు పట్టించుకునే నాధుడే ఉండడు.

– బలే పుల్లమ్మ, లబ్ధిదారురాలు, పెదయాగనమిల్లి

దళితసేన వార్షికోత్సవ పోస్టర్ విడుదల



వార్షికోత్సవ పోస్టర్ విడుదల చేసిన లిడ్‌క్యాప్ చైర్మన్ రాజశేఖర్

ఏలూరు (టూటౌన్): ఈ నెల 29న దళిత సేన మూడో వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమ వాల్ పోస్టర్‌ను లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. దళిత సేన వార్షికోత్సవ సభ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్, నాయకులు బేతాళ జయసుధ, పింగుల ఈథియా,రావూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో సంపద సృష్టించాలి



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాము

ఏలూరు రూరల్ : ఉపాధి హామీ పథకం నిధులతో కూలీల జీవన స్థితిగతులు మెరుగు పడడంతో పాటు సంపద సృష్టి జరగాలని ఏలూరు జిల్లా డ్వామా పీడీ ఎ.రాము అన్నారు. మంగళవారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏలూరు మండలం ఉపాధి హామీ పథకం పనుల సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ క్లినిక్ భవనాల నిర్మాణం సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించిందన్నారు. జగనన్నకాలనీలో ఇళ్లు కట్టుకునే వారికి ముందస్తుగా మస్తర్లు వేయాలని సిబ్బందికి సూచించారు. కొత్త జాబ్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు ప్రతి కుటుంబానికీ 100 రోజుల పని దినాలు కల్పించేలా పనులు చేపట్టాలన్నారు. సిబ్బంది నైపుణ్యం మెరుగుపరుచుకోవడంతో పాటు పథకంలో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. దీనికి ముందు సోషల్ అడిట్ సిబ్బంది గ్రామాల వారీగా వెల్లడించిన నివేదికపై సమీక్షించారు. పలు గ్రామాల్లో మస్తర్ల కొట్టివేత గుర్తించి, పేమెంట్ మొత్తాన్ని ఫీల్డ్ అసిస్టెంట్లు చెల్లించాలని ఆదేశించారు. వాచ్, వాటర్ ద్వారా గ్రామీణ ప్రజలకు మొక్కలు పెంచే బాధ్యత అప్పగించాలన్నారు. మొత్తంగా 2022–23 సంవత్సరానికి సుమారు రూ.26 కోట్లతో చేపట్టిన పనులపై సమీక్ష పూర్తి చేశారు. సమావేశంలో ఏపీడీ సుధాకర్, విజయలక్ష్మి, ఎస్ఆర్‌పీ రామచంద్రరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత, ఏపీఓ కిషోర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మహిళా సమాఖ్య జిల్లా కార్యవర్గం



జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు మొక్కను అందిస్తున్న మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసిన సీఐ శివాజీ

ఏలూరు(మెట్రో): మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా నూతన పాలకవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. మహిళా సమాఖ్య సభ్యులు జిల్లాలో మహిళా సంఘాలు చేస్తున్న అభివృద్ధి పనులను, హౌసింగ్ లబ్ధిదారులకు సంఘాల ద్వారా అదనపు రుణాలు ఇప్పించడం, చేయూత, మహిళా మార్ట్, జగనన్న తోడు వంటి పథకాలు గురించి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా సమాఖ్య పాలకవర్గ అధ్యక్షురాలు డి.పద్మావతి, ఉపాధ్యక్షురాలు జి.జ్యోతి, కార్యదర్శి ఎస్.గొల్లమ్మ, సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకటలక్ష్మి, కోశాధికారి కె.నవత, నూతన పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సీఐ

ఏలూరు 3 టౌన్ సీఐగా కోమకుల శివాజీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మంగళవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కాగా కోమకుల శివాజీ మచిలీపట్నంలో డీసీఆర్‌బీ, ఎస్‌బీ రేంజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఏలూరు 3 టౌన్ సీఐగా బదిలీపై వచ్చారు. ఆయన గతంలో ఏలూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్సైగా కూడా పనిచేశారు.

మిగులు భూములు పంచాలంటూ వినతి



ఏకసాల్ పట్టాలు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): పేదలపై అక్రమ కేసులు పెట్టిన భూస్వాములపై చర్యలు తీసుకోవాలని, ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు పంచాలని, సాగుకు అవకాశం కల్పిస్తూ ఏక్‌సాల్ పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి కోరారు. ఈ మేరకు జిల్లా ఇరిగేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. అనంతరం సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జిల్లాలో గత ఎనిమిదేళ్ల నుంచి ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తోన్న ఇరిగేషన్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇరిగేషన్ భూముల్లో పేదలకు సాగు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఉన్నా అది అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 35 ఏళ్లుగా ఎర్రకాలువ మిగులు భూములను భూస్వాములు దర్జాగా అనుభవిస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు భూస్వాముల పట్ల సానుకూలంగా, పేదల పట్ల ఇబ్బందికరంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు టి.సత్యనారాయణ, ఎస్.మహాంకాళిరావు, జి.సూర్యకిరణ్, యాగంటి సీత, మొగలి మంగ తదితరులు పాల్గొన్నారు.

పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత

జెడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ



ఘంటా పద్మశ్రీ, జెడ్పీ చైర్ పర్సన్

ఏలూరు(మెట్రో): సమాజంలో మహిళలకు గుర్తింపు ఉండేలా ఎన్నో పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన జగనన్న తోడు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడారు. సమాజంలో గౌరవంగా జీవించేందుకు గుర్తింపు ఉండేలా ఎన్నో పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి విన్నూత్నమైన రీతిలో పథకాలను అమలు చేస్తున్నారని, వాటిని మహిళల పేరునే మంజూరు చేస్తున్నారని వివరించారు. ప్రతి మహిళకూ లబ్ధి చేకూరే విధంగా అమ్మఒడి, ఆసరా, చేయూత, జగనన్న తోడు, ఈబీసీ, కాపు నేస్తం వంటి పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. దేశంలోనే అత్యధికంగా వడ్డీ లేని రుణాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి పేదకుటుంబం జీవన ప్రమాణాల స్థాయి మెరుగుపడిందని చెప్పారు. చిరు వ్యాపారులు హస్త కళాకారులు సంప్రదాయ చేతివృత్తుల వారికి ఏటా జగనన్న తోడు కార్యక్రమం ద్వారా రూ.10,000 సున్నా వడ్డీకే రుణం అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో జగనన్న తోడు ఏడో విడతలో 5.10 లక్షల మంది చిరు వ్యాపారులకు రూ.549.70 కోట్లు వడ్డీ లేని రుణాలు, రూ.11.03 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్ కలిపి మొత్తం రూ.560.73 కోట్లను అందిస్తున్నారని చెప్పారు. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి వారి తరఫున వడ్డీని జగనన్న ప్రభుత్వమే భరిస్తుందన్నారు. తాము గడపగడపకు కార్యక్రమంలో పాల్గొనే సమయంలో చిరు వ్యాపారాలు చేసుకునే ఎంతోమంది జగనన్నచేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఎంతో గొప్పగా చెబుతున్నారని పద్మశ్రీ వివరించారు.

వర్షపునీటిని పొదుపు చేయాలి



పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులు

ఏలూరు రూరల్: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఉమెన్ ఇన్‌స్టిట్యూట్ సోషల్ ఎంపోర్‌మెంట్ అనే స్వచ్ఛంద సంస్థం వర్షపునీటిపై పిల్లల్లో అవగాహన కార్యక్రమం స్థానిక ఈదర సుబ్బమ్మదేవి పాఠశాలలో నిర్వహించింది. కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నీటి సంరక్షణ, పొదుపుపై పిల్లల్లో మరింత అవగాహన పెరగాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. హెచ్‌ఎం కుటుంబరావు, మల్లేశ్‌కుమార్, టి.ప్రకాష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో కారుణ్య నియామకం



ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి, చిత్రంలో ఏఎస్పీ భాస్కరరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించాలని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏఆర్ ఎస్సై లోయే నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన కుమార్తె జాహ్నవి దుర్గకు పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ మంచి సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వం అప్పగించిన పనులను చిత్తశుద్ధితో చేస్తూ అధికారులకు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఏలూరు జిల్లా హోమ్‌గార్డు విభాగంలో పనిచేస్తోన్న హోమ్‌గార్డు ఎస్ఆర్‌డీ ప్రసాద్ గత ఏడాది అనారోగ్యంతో మరణించారు. ఆయన సతీమణి రాధాకుమారికి మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ చేతులమీదుగా రూ.5,53,90 చెక్కును అందజేశారు. కార్యక్రమాల్లో జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఆర్ఐ పవన్‌కుమార్, హోంగార్డు ఆర్ఎస్ఐ భాస్కరరావు, డీసీఆర్‌బీ సీఐ దుర్గాప్రసాద్, డీసీఆర్‌బీ ఎస్సై సాధిక్, ఎస్పీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సాల్మన్, సిబ్బంది ఉన్నారు.

పెదయాగనమిల్లిలో 354 సేవలు



ధ్రువ పత్రాలు అందుకున్న ప్రజలతో తహసీల్దార్

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం పెదయాగనమిల్లిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు 354 మందికి ధ్రువ పత్రాలను అందజేశారు. వీటిలో 164 కుల, 131 ఆదాయ, 22 ఆర్‌ఓఆర్, 18 అడంగల్ ధ్రువ పత్రాలు ఉన్నాయి. ఆరుగురికి రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులు, 12 మందికి ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేశారు. ఏడుగురికి పలు రకాల ధ్రువ పత్రాలను అందజేశారు. మొత్తంగా 360 మంది పలు ధ్రువ పత్రాలకు దరఖాస్తు చేసుకోగా ఆరు దరఖాస్తులను తిరస్కరించారు. పెదయాగనమిల్లి సచివాలయ వద్ద సర్పంచ్ బలే నాగసులోచన అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.సోమశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 11 అంశాల్లో ప్రభుత్వం అందిస్తోన్న సేవల గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన న్నారు. ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, కలకుర్రు సర్పంచ్ బలే నాగప్రసాద్, బలే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

టి.నరసాపురం : ఇటీవల విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రి వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న వెలగపాడు గ్రామానికి చెందిన నరదల కీర్తి కావ్యశ్రీకి మంగళవారం కామవరపుకోట సోషల్ వర్కర్స్ టీమ్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆ టీమ్ సభ్యులు వీరమళ్ల మధు, పెద్దింటి చంటి దాతల నుంచి సేకరించిన రూ.12,300 బాధితురాలికి అందజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం

ఏపుగుంట గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన డొక్కా గంగరాజు కుటుంబానికి మంగళవారం బీజేపీ నాయకులు తపన చౌదరి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని వేగేశ్న సత్రంరాజు ద్వారా అందజేశారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జట్ల రాంబాబు, పార్టీ మండలాధ్యక్షులు మాలంపాటి హరిశ్చంద్రప్రసాద్, కార్యదర్శి రామలింగేశ్వరరావు, మక్కిన శ్యామ్, అడపా వెంకట్రావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీల్డ్ టెండర్స్ /బహిరంగ వేలము కొరకు ప్రకటన

తేది. 18.07.2023

[illegible]

నాగం సన్యాసిరావు

తేది: 18.07.2023

పనిభారం తగ్గించాలి

ఏలూరు (టూటౌన్): ఆశావర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదని, పనిభారం తగ్గించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అధికారుల వేధింపులు ఆపాలని ఆశ వర్కర్లు మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్ లింగరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడారు. ఈ మేరకు డీపీఓ జోషికి వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా నాయకులు రోజా, లోకేశ్వరి, నాగమణి, కనకదుర్గ తదితరులు నాయకత్వం వహించారు.

భర్తపై వేధింపుల కేసు

ఏలూరు టౌన్: మద్యానికి బానిసగా మారిన ఒక వ్యక్తి భార్యను వేధింపులకు గురిచేయటంతో ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారపుపేటకు చెందిన అంద్ర నాగకుమారికి 12 ఏళ్ల క్రితం మహేష్ అనే వ్యక్తితో వివాహం కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహేష్ మద్యానికి బానిసై రోజూ తాగొచ్చి భార్యను నిత్యం శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని, పట్టిసీమ ద్వారా రైతులకు సాగు నీరు అందించాలని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు భరోసా కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

స్టాప్ బోర్డుల అందజేత

ఉంగుటూరు: మదర్ థెరిస్సా చికిత్స కేంద్రం తరపున వాహన వేగ నియంత్రణ నాలుగు బోర్డులను మంగళవారం అందజేశారు. చేబ్రోలు పోలీసులు ద్వారా వీటిని కైకరం సెంటర్లో ఉపయోగించనున్నారు. చికిత్స కేంద్రం నిర్వాహకులు వైసీపీ నాయకుడు ఎలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీదేవి, స్థానిక నాయకుల ద్వారా వాటిని అందజేశారు. వైసీపీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి పాల్గొన్నారు.

దోమతోనే వ్యాధుల వ్యాప్తి



కొత్తపల్లిలో వృద్ధురాలికి రక్తపరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమల నివారణతో వ్యాధులకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. బుధవారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి గణపవరం మండలం కొత్తపల్లి, గణపవరంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. దోమల వ్యాప్తి, నివారణ, దోమల నుంచి రక్షణ తదితర అంశాలపై ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో జాలాదివిల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్ పాల్గొన్నారు.

డెంగీ వ్యాధికి దూరంగా ఉండండి

వర్షాలు కురుస్తున్న సమయంలో వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌నాయుడు అన్నారు. మంగళవారం గణపవరం -3 సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	25